ప్రజాశక్తి

శుక్రవారం 4 ఏప్రిల్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

15 శాతం వృద్ధి కోసం 3 రంగాలు

- ఉద్యాన, పశుపోషణ, పర్యాటకంపై ప్రత్యేక దృష్టి
- పశువుల కొనుగోలుకు డ్వాక్రా మహిళలకు అదనంగా సాయం
- అనుమతులున్న పరిశ్రమల ప్రారంభం
- కోళ్ల ఫారాల పున: ప్రారంభానికి చర్యలు
- పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

4లో

ఇంటెర్రర్ విద్య



- వేసవి సెలవుల్లేకుండానే ఇంటర్ తరగతులు ప్రారంభం
- విద్యార్థులపై పెరుగుతున్న ఒత్తిడి
- నామమాత్రంగానే హాజరు శాతం

ప్రజాశక్తి-గుంటూరు

ఇంటర్ విద్య అకడమిక్ షెడ్యూల్‌లో మార్పులు చేస్తూ రాష్ట్రం ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే ఇంటర్ విద్యలో కార్పొరేటీకరణ పెరిగిపోయి విద్యార్థులు తీవ్ర స్థాయిలో ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఈ తరుణంలో వారిపై మరింత ఒత్తిడి పెంచే విధంగా, వేసవి సెలవులు లేకుండానే కొత్త విద్యా సంవత్సరం ప్రారంభిస్తూ చేసిన మార్పులు చేయటం సరికాదని విద్యావేత్తలు, తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల కోసమే ప్రభుత్వం ఈ మార్పులు చేసిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈనెల ఒకటో తేదీ నుండే జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ,

2లో

నేటి నుండి నాటకోత్సవాలు

- పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం ఆధ్వర్యంలో యడ్లపాడులో 22వ జాతీయ స్థాయి పోటీలు
- పూర్తయిన ఏర్పాట్లు - ఇంటింటికీ వెళ్లి ఆహ్వాన పత్రికలిచ్చిన నిర్వాహకులు



4లో



మాచర్ల మండలంలో మిర్చి పంటను కాపాడుకునే ప్రయత్నంలో రైతు

ఉన్నట్టుండి గాలి.. వాన..

మిర్చి పంటను కాపాడుకోవడానికి రైతుల తంటాలు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లాల్లో ఉంది. ఒక వైపు దిగుబడి తగ్గి, మరో వైపు మద్దతు ధర కూడ లేక ఆవేదనతో ఉన్న రైతులను ఆకాల వర్షాలు తీవ్ర ఆందోళనకు గురి చేసింది. గురువారం ఉదయం నుండే ఆకాశం మోఘావృతమై ఉండటంతో రైతులు కళ్లాల్లోని

2లో



మాచర్ల మండలంలో రహదారిపై వాన నీరు

ఉన్నట్టుండి గాలి.. వాన..

(మొదటి పేజీ తరువాయి)

పంటపై పట్టాలు కప్పి జాగ్రత్తలు తీసుకున్నారు. అయినా మధ్యాహ్న సమయంలో వచ్చిన ఈదురు గాలులు, గంటపాటు వాన మిర్చి పంటను ముంచేసింది. పొలాల్లో మిర్చి కోతలకు వచ్చిన కూలీలు తడిచి ముద్దవగా కళ్లాల్లోని మిర్చిని తరలించేందుకు వచ్చిన లారీలు పొలాల్లోనే నిలిచి పోవాల్సి వచ్చింది. మరోవైపు వాన నేపథ్యంలో రహదార్లు జలమయమయ్యాయి.



నందిగామ అడ్డరోడ్డు వద్ద మిర్చి కళ్లాలపై కప్పిన పట్టాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలంలో గురువారం రాత్రి అకాల వర్షం కురిపిస్తుంది. మిర్చి కళ్లాలోని మిరపకాయలను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడ్డారు. నందిగామ అడ్డరోడ్డు, నందిగామ అబ్బూరు తదితర గ్రామాల్లో అకస్మాత్తుగా చిరు జల్లులు పడ్డాయి. మిరపకాయలను కాపాడుకునేందుకు రైతులు పట్టాలు కప్పారు.



పంచాయతీల కార్యదర్శులతో సమీక్షిస్తున్న డిపిఒ

అపారిశుధ్యంపై డిపిఒ అగ్రహం

ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు మెమోలు

ప్రజాశక్తి - నాదెండ్ల

మండంలోని పలు గ్రామాల్లో పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్‌రెడ్డి గురువారం పర్యటించారు. పారిశుధ్యం సరిగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు బుక్కాపురం, ఎండుగుంపాలెం పంచాయతీ కార్యదర్శులకు మెమోలు జారీ చేశారు. తొలుత బుక్కాపురం చేరుకున్న డీపీవో గ్రామంలో చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణపై ఆరా తీశారు. గ్రామస్తులు పలు సమస్యలను చెప్పడం, రోడ్ల వెంట చెత్త కూడా ఉండడంతో పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితిని సత్వరం చక్కదిద్దాలన్నారు. అనంతరం ఎండుగుంపాలెం గ్రామానికి చేరుకుని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని తనిఖీ చేసి నిర్వహణా లోపంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యదర్శికి మెమో ఇచ్చారు. అనంతరం జంగాలపల్లి గ్రామంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. స్వమిత్వ చివరి దశకు చేరుకోవడంతో అక్కడి కార్యదర్శికి పలు సూచనలు చేశారు. చివరగా మండల కేంద్రమైన నాదెండ్ల చేరుకుని మండల పరిధిలోని కార్యదర్శులతో పలు అంశాలపై సమీక్షించారు. పారిశుధ్య నిర్వహణపై ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్స్ వస్తున్నందున ప్రజల నుండి మంచి స్పందన లభించేలా అందరూ కృషి చేయాలని, చెత్తకుప్పలను ఎక్కడా ఉండనివ్వొద్దని ఆదేశించారు. ఇంటి పన్నులు సకాలంలో వసూలును నూరుశాతం పూర్తి చేయాలన్నారు. ఇక నుండి అన్ని గ్రామాల్లో 22 అడుగుల వెడల్పు రోడ్లు ఉండేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని డిపిఒ సూచించారు.

పనులు చూపరు.. చేసిన పనికి కూలివ్వరు..

వ్యవసాయ కార్మిక సంఘం బైక్ యాత్ర బృందం ఎదుట ఉపాధి హామీ కూలీల ఆవేదన



ప్రజాశక్తి - అమరావతి

తాము ఉపాధి హామీ పనులను గతంలో చేసినా ప్రస్తుం జాబ్ కార్డులు యాక్టీవ్‌గా లేవంటూ పనులు కల్పించడం లేదని అమరావతిలోని ఉపాధి హామీ కూలీలు వాపోతున్నారు. కూలీల సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టిన బైక్ యాత్ర గురువారం అమరావతిలో పర్యటించింది. ఈ సందర్భంగా కూలీలు తమ సమస్యలను బైక్ యాత్ర బృందం ఎదుట ఏకరువు పెట్టారు. జాబ్ కార్డులు తొలగించడంతో పనులకు వెళ్లలేక, ఉపాధి దొరక్క ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అనంతరం సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ కార్డులు యాక్టీవ్‌గా లేవనే పేరుతో కూలీలను ఉపాధికి దూరం చేయడం తగదని, అందరికీ పనులు కల్పించాలని కోరారు. బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం కాలేదనే సాంకేతిక కారణాలతో పని చేసినా కూలి డబ్బులు ఇవ్వడం లేదని, పెద్దఎత్తున బకాయిలున్నాయని చెప్పారు. నెలల తరబడి కూలి అందక పేదలు ఇబ్బందులు పడుతున్నారని, సత్వరమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జె.భగత్, వై.వెంకటేశ్వర్లు, యేసయ్య పాల్గొన్నారు.



ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని బలుసుపాడు, పరస, 75 తాళ్లూరు, పెదకూరపాడు, లగడపాడు గ్రామాల్లో బైక్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు తమ సమస్యలను నాయకులకు విన్నవించారు. పనులు చేసి ఐదారు వారాలైనా కూలి రాలేదని, కుటుంబాలు గడవడం కష్టంగా ఉందని చెప్పారు. రవిబాబు మాట్లాడుతూ పెండింగ్ కూలిని వెంటనే విడుదల చేయాలని అధికారులను డిమాండ్ చేశారు.

పైప్‌లైన్ నిర్మాణానికి రైతులు సహకరించాలి



అధికారులకు సమస్యలు చెబుతున్న రైతులు

ప్రజాశక్తి - నకరికల్లు

భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ పైప్‌లైన్ కింద భూములు కోల్పోయే రైతులకు రూ.12 వేలు చొప్పున నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని బిపిసిఎల్ పైప్‌లైన్ స్పెషల్ కలెక్టర్ ఎం.శ్రీదేవి తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నకరికల్లు, నర్సింగపాడు, చల్లగుండ్ల, గ్రామాల రైతులు, సంస్థ ప్రతినిధులతో స్పెషల్ కలెక్టర్ గురువారం సమావేశం నిర్వహించారు. 2019లో కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన ప్రాజెక్టు అయిన కారణంగా దాని ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని రైతులు సహకరించాలని కోరారు. కృష్ణపట్నం పోర్టు నుండి హైదరాబాద్ వరకు 308 కిలోమీటర్ల పైపుల నిర్మాణం, 105 గ్రామాల ప్రజల నుండి 8 వేల రైతుల నుంచి భూమిని సేకరించాల్సి ఉండగా 102 గ్రామాల ప్రజల రైతులు మాత్రమే భూమి ఇచ్చారని తెలిపారు. నరసింగపాడు, చల్లగుండ్ల, నకరికల్లు, గ్రామాల రైతులకు ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని పల్నాడు, నెల్లూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో 275 కిలోమీటర్లు పైప్‌లైన్ నిర్మాణం ప్రభుత్వ నియమ నిబంధనలతో పూర్తి చేసామన్నారు. భూమి కోల్పోయే రైతులు పొలాల్లో ఏమైనా నిర్మాణాలు చేపట్టాలంటే భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వారు ఎన్ఓసి సర్టిఫికెట్ అందజేస్తారన్నారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పంటలు పూర్తయిన తర్వాతే రైతులను పిలిపించి పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాలని, రైతుల మధ్య వివాద సమస్యలు ఉంటే పరిష్కరించేలా చర్యలు చేపడతామని తెలిపారు. పల్నాడు జిల్లాలో 24 గ్రామాలలో 83.91 కిలోమీటర్లు పైప్‌లైన్ నిర్మాణం పూర్తయిందని తెలిపారు. కార్యక్రమంలో తాహశీల్దార్ పుల్లారావు, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ప్రాజెక్టు హెడ్ భగవాన్ శుక్ల, అమిత్ కాంబ్లి, పవన్, రైతులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విరుద్ధంగా వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : రాజ్యాంగంలోని 14, 25, 26 ఆర్టికల్స్‌ను ఉల్లంఘిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును తెచ్చిందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. నరసరావుపేట పట్టణం గుంటూరు రోడ్డులోని వైసిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు భారత ఈ సవరణతో వక్ఫ్ బోర్డులో ముస్లిమేతర వ్యక్తిని కమిటీలో తీసుకురావడం జరుగుతుందని అన్నారు. కేవలం ఆరు నెలల్లో వక్ఫ్ బోర్డు ఆస్తులను సెంట్రల్ డేటా బేస్‌లో తీసుకురావడం అసాధ్యమన్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను కొల్లగొట్టడానికి కేంద్రంలో అధికారంలో బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు బిజెపితో కలిసి టిడిపి, జనసేనలు ఓటు వేయడం రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టడమేనన్నారు.

ఇంటర్ విద్య

(మొదటి పేజీ తరువాయి)

ఎయిడెడ్ విద్యా సంస్థల్లో విద్యార్థుల హాజరు 10 శాతం కూడా దాటట్లేదు. ప్రభుత్వ కాలేజీల అధ్యాపకులు ఎక్కువ మంది పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో ఉండటంతో వారు కాలేజీల్లో తరగతులకు హాజరు కాలేకపోతున్నారు. దీంతో తరగతులు జరగకపోవటంతో వచ్చిన కొద్ది మంది వెనుదిరుగుతున్నారు. మరోవైపు కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల్లో బలవంతపు చదువులతో విద్యార్థులు ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. 46 డిగ్రీలపైన వేడి గాలులతో చదువులు కొనసాగించటం కష్టసాధ్యంగా మారిందని వాపోతున్నారు. ప్రభుత్వ, ఎయిడ్ కాలేజిల్లో చదువుకునే విద్యార్థులు దూర ప్రాంతాల నుండి ఇంటి వద్ద నుండి ఎండల్లో కాలేజీలకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు.

జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 32 వేల మంది, ద్వితీయ సంవత్సరంలో 36 వేల మంది విద్యార్థులు గతేడాది విద్యను అభ్యసించారు. ప్రతి ఏటా దాదాపు 75 వేల మంది ఇంటర్ చదువుతున్నారు. నాలుగు ప్రభుత్వ జనరల్ కాలేజీలు, ఒక ఒకేషనల్ కాలేజి, ఆరు ఎయిడెడ్ కాలేజీలు ఉండగా, 163 ప్రైవేటు కాలేజీలున్నాయి. విద్యార్థుల సంఖ్యలో కూడా 80 శాతంపైగా ప్రైవేటు కార్పొరేట్ కాలేజీల్లోనే ఉన్నారు. గతంలో మార్చి నెల చివరిలో పరీక్షలు ముగించుకొని, రెండు నెలలు వేసవి సెలవులిచ్చే వారు. జూన్ 1 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేది. దీంతో విద్యార్థులకు కొన్ని రోజులైనా కుటుంబంతో గడిపే వారు. గతంలో వేసవిలోనూ కార్పొరేట్ కాలేజీలు, కొన్ని ప్రైవేటు కాలేజీలు తరగతులు నిర్వహించేవి. దీనిపై వ్యతిరేకత వచ్చింది. అయితే ఈ ఏడాది ప్రభుత్వమే ఏప్రిల్ 1 నుండి తరగతులు నిర్వహించుకోవటానికి వీలు కల్పిస్తూ నిర్ణయం తీసుకోవటంతో వారికి అధికారికంగా లైసెన్స్ ఇచ్చినట్లయ్యింది. దీంతో ఇటీవల పరీక్షలు ముగిసిన వెంటనే మార్చిలోనే ప్రైవేటు, కార్పొరేట్ కాలేజిల్లో తరగుతులు ప్రారంభించారు. పదో తరగతి పరీక్షలు ముగియలేదు. ప్రైవేటు విద్యా సంస్థలు ఇంటర్ అడ్మిషన్లు కూడా ప్రారంభించగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో అడ్మిషన్లు ప్రారంభం కాలేదు. ప్రభుత్వ చేపట్టిన సంస్కరణలు ప్రభుత్వ కాలేజీలను మరింత నిర్వీర్యం చేసే విధంగా ఉన్నాయని విమర్శలు వస్తున్నాయి. తక్షణమే ఈ విధాన్ని పున:సమీక్షించాలని తల్లిదండ్రులు, విద్యార్థులు, విద్యావేత్తలు కోరుతున్నారు.

ఆశాలపై రాజకీయ వేధింపులు ఆపకుంటే కలెక్టరేట్ ముట్టడి

ఎపి ఆశా వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : మాతా శిశు సంరక్షణకు గౌరవ వేతనం తీసుకుంటూ విశేష సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లపై రాజకీయ వేధింపులు తగదని, వేధింపులు ఆపకపోతే యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఏపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివకుమారి హెచ్చరించారు. నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో గురువారం ఆశా వర్కర్స్ జిల్లా కమిటీ సమావేశం ఉపాధ్యక్షులు ఎం.భూలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఇటీవల కృష్ణా, అనంతపురం జిల్లాల్లో మృతి చెందిన ఆశా వర్కర్లు నాగలక్ష్మి, లక్ష్మీదేవికి సమావేశం సంతాపం తెలిసింది. అనంతరం శివకుమారి మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ కింద 2004లో ప్రవేశ పెట్టిన పథకం మాతా శిశు మరణాలు చాలావరకు తగ్గుముఖం పట్టాయని, దీనిపై కేంద్రం నియమించిన కమిటీ కూడా సేవలు బాగున్నాయని, ఆశా వర్కర్లను పర్మినెంట్ చేయాలని చెప్పిందని గుర్తు చేశారు. అయినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఆరంభంలో రూ.75 వేతనాన్ని ఇవ్వగా యూనియన్ ఆధ్వర్యంలో చేసిన అనేక పోరాటాల ఫలితంగా ప్రస్తుతం రూ.10 వేలు వేతనం అమలవుతోందని తెలిపారు. అయితే ప్రభుత్వాలు మారిన ప్రతిసారి ఆశా వర్కర్లపై రాజకీయ వేధింపులు జరుగుతున్నాయన్నారు. వీటిని అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గాని నిలువరించడం లేదని, దీంతో ఆశ కార్యకర్తలు మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం పాలవుతున్నారని, కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, వారాంతపు సెలవులు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, ఆశా వర్కర్లు జ్యోతి, ధనలక్ష్మి, సువార్త, రమణ, బుజ్జి పాల్గొన్నారు.

మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం : డిఆర్‌డిఎ పీడీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ప్రతి మహిళను పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని ప్రతి మహిళ పారిశ్రామిక వేత్తగా ఎదిగి ఆదర్శంగా నిలవాలని డిఆర్ డిఎ పీడీ ఝాన్సీ రాణి అన్నారు. మండల కేంద్రం రొంపిచర్ల మహిళాభివృద్ధి మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో యానిమేటర్లకు పలు అంశాలపై శిక్షణిచ్చారు. పిడి ఝాన్సీ రాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదిగేందుకు ప్రణాళిక రూపకల్పన చేస్తున్నారన్నారనీ, దీనికి తగ్గట్టుగా కార్యాచరణ తయారు చేయాలని ఆదేశించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల స్థాపనకు మహిళలు ముందుకు రావాలన్నారు. ఏపిఎం తానికొండ సోమశేఖర్ మహిళలకు జీవనోపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు తమ వంతు కృషి చేస్తామని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపియం హనుమా నాయక్, సిసిలు మల్లేశ్వరరావు, సత్యనారాయణ, రాజు, ఆదిలక్ష్మీ, పార్వతి, అకౌంటెంట్ రాధిక పాల్గొన్నారు.

7న విజయవాడలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తుళ్లూరు : యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ హెచ్ - 176 (సిఐటియు) ఆధ్వర్యం లో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో ని ఎపిసిపిడిసిఎల్ విద్యుత్ భవన్ వద్ద 7వ తేదీన జరిగే ధర్నాను జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి లక్ష్మణరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి నాగరాజులు పిలుపు నిచ్చారు. గురువారం రాజధాని అమరావతి పరిధిలోని రాయపూడి విద్యుత్ భవన్ వద్ద ధర్నా పోస్టర్ ను ఆవిష్కరించారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపును జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2022 పిఆర్సి ఏరియర్స్ నేటికీ కార్మికుల ఖాతాలో జమ చేయలేదని, తక్షణమే ప్రతి కార్మికుడికీ ఇవ్వాలన్నారు. తెలంగాణ తరహా సంస్థలో విలీనం చేసి సంస్థ ద్వారా వేతనాలు ఇవ్వాలని, కార్మికులను కొత్త, పాత పేరుతో వేర్వేరు జీతాలు ఇస్తూ తక్కువ వేతనాలతో పని చేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. గతంలో మాదిరిగా సమాన పనికి సమాన వేతనం, అందరికీ ఒకే రకమైన వేతనాలు ఇవ్వాలని, సీనియర్లకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త షిఫ్ట్ ఆపరేటర్లందరికీ పాత ఆపరేటర్ తో సమానంగా జీతాలు ఇవ్వాలన్నారు. పీస్ రేటు కార్మికులుగా ఉన్న స్టోర్ హమాలీలు, మీటర్ రీడర్స్,బిల్లు కలెక్షన్ ఏజెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించి నెల వేతనాలు ఇవ్వాలన్నారు. ట్రాన్స్‌కో డిస్కం జెన్‌కోలో పనిచేస్తున్న 23,500 మంది విద్యుత్ కార్మికులకు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

2022 పిఆర్సి అరియర్స్ ఇంతవరకు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని, పస్తుత ప్రభుత్వమైనా గత ప్రభుత్వం చేసిన ఒప్పందాన్ని అమలు చేయాలని కార్మికులు కోరుకుంటున్నారని, పతి సబ్ స్టేషన్ లో నైట్ వాచ్ మెన్ ను నియమించాలని, డిమాండ్ చేశారు. ఏప్రిల్ 7 జరిగే ధర్నా లో విద్యుత్ కార్మికులందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జి పవన్ , జిల్లా కోశాధికారి రాంబాబు, అమరావతి డివిజన్ కార్యదర్శి సిహెచ్ నాగ వంశీ, నాయకులు సుమన్, బాబు,నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ చట్టం సవరణలను విరమించుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర పెన్షన్ చట్టం రూల్స్‌కి చేయ దలుచుకున్న సవం´ణలు విరమించుకోవాలని ఆలిండి యా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ (ఎఐఎస్‌పిఇ) వ్యవస్థాపక సెక్రెటరీ జనరల్ జి.పూర్ణచంద్రరావు డిమాండ్ చేశారు. ఎఐఎస్‌పిఇ ఆధ్వర్యంలో కేంద్ర సవరణలపై గురువారం కలెక్టరేట్‌లోని అసోసియేషన్ కార్యాలయ ప్రాంగణంలో సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ కేంద్రం చేయబోయే సవరణలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు గుదిబండగా మారతుందని, పెన్షనర్లకు తీవ్ర విఘాతం కలుగుతుందని తెలిపారు. గతంలో సుప్రీం కోర్టు



మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

డిఎస్ నకారా కేసులో ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా ఈ సవరణ ఉందన్నారు. ఇలాంటి చట్టం తేవటం కేంద్రానికి తగదని అన్నారు. తక్షణమే సవరణ ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌పిఎఫ్ కార్యదర్శి పి.నాగరాజు, జిల్లా రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఉద్యోగ సంఘాల నాయకులు ఎం.ఎస్.మూర్తి, నాయకులు సాయిబాబు, సుబ్బారావు, నాగేశ్వరరావు, జి.వి.ప్రసాదలింగం, టి.శ్రీనివాసరావు, జె.పార్థసారధి, రాధాకృష్ణ, లూర్దురెడ్డి పాల్గొన్నారు. సదస్సు అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు.

సమస్యకు జనాభా పెరుగుదల పరిష్కారం కాదు

ప్రజాశక్తి-గుంటూరు

సమాజంలో అన్ని రంగాలలో అభివృద్ధి జరగకుండా నిరక్షరాస్యత, పేదరికం, నిరుద్యోగం, అధికంగా ఉన్న పరిస్థితులలో మరింతమంది పిల్లలను కనమని ప్రోత్సహించడం సహేతుకం కాదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేసిన రిటైర్డ్ ఐఎఎస్ అధికారి డాక్టర్ పి.వి.రమేష్ అన్నారు. గురువారం స్థానిక జనచైతన్యవేదిక సమావేశ మందిరంలో నిర్వహించిన అధిక జనాభా వరమా, భారమా అనే అంశంపై జరిగిన చర్చాగోష్టిలో డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రపంచంలో 2000 సంవత్సరాల క్రితం 20 కోట్ల జనాభా ఉంటే నేడు 823 కోట్లకు చేరిందని, 2058 నాటికి 1000 కోట్లకు చేరుతుందన్నారు. పారిశ్రామిక విప్లవం, విద్య, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులు రావడం వలన మరణాల రేట్లు గణనీయంగా తగ్గుతూ జనాభా పెరుగుదలకు తోడ్పడిందన్నారు. ప్రపంచ భూభాగంలో 2.4 శాతం కలిగి ఉన్న భారతదేశం ప్రపంచ జనాభాలో 18శాతంతో అగ్ర భాగాన ఉన్నామన్నారు. పేదరికం, నిరక్షరాస్యత అధికంగా ఉన్న ప్రాంతాలలో కుల, మతాలకు అతీతంగా జనాభా పెరుగుదల రేటు ఎక్కువగా ఉంటుందని, అభివృద్ధి చెందిన ప్రాంతాలలో జనాభా పెరుగుదల రేటు తక్కువగా ఉందన్నారు. బీహార్ , మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్‌లలో నేటికీ జనాభా పెరుగుదల రేటు 2.5 శాతంగా ఉండగా దక్షిణాది రాష్ట్రాలలో ఒక శాతం లోపే ఉందన్నారు. జపాన్, దక్షిణ కొరియా, ఫిన్ ల్యాండ్, చైనా లాంటి దేశాలలో జనాభా పెరుగుదలకు ఎన్నో ప్రోత్సాహకాలు అందిస్తున్నా జనాభా పెరుగుదలలో పెద్దగా మార్పు లేకపోవడం గుర్తించాలన్నారు. 147 కోట్ల జనాభాతో ప్రపంచంలో అగ్ర భాగాన ఉన్న ఇండియాలో



మాట్లాడుతున్న విశ్రాంత ఐఎఎస్ అధికారి డాక్టర్ పివి రమేష్

మరింతమంది పిల్లలను కనమని రాజకీయ నాయకులు పిలుపునివ్వడం సరైనది కాదన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశం ఆకలి సూచికలో 105వ స్థానం, ఆనందసూచికలో 118 వ స్థానం, మానవ వనరుల అభివృద్ధి సూచికలో 134వ స్థానం, తలసరి ఆదాయ సూచికలో 126వ స్థానంలో ఉంటున్న నేటి పరిస్థితులలో అధికంగా పిల్లలను కనమని చెబుతూ జనాభాను పెంచితే అత్యధిక సమస్యలను ఎదుర్కొంటా మన్నారు. ఆంధ్రప్రదేశ్ లో నిరాక్షరాస్యత, నిరుద్యోగం, పేదరికం, అసమానతలు నివారించిన తర్వాతనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికంగా పిల్లలను కనమని కోరాలన్నారు.మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ జనాభా పెరుగుదలను గూర్చి ఆలోచించడం మాని రాష్ట్ర అభివృద్ధి, ఉపాధి కల్పన, నైపుణ్యాల అభివృద్ధి, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో ఉత్పాదకత పెంపుదల కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ ఆర్థిక వేత్త ప్రొఫెసర్ డి.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం, డాక్టర్ ఆలా వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఏపీ గెజిటెడ్ ఆఫీసర్స్ పూర్వ అధ్యక్షులు ఏ .వి .పటేల్ ప్రసంగించారు.

జగన్ ఫొటోల మార్ఫింగ్‌పై ఆరు కేసులు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఇటీవల మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఫొటోలు మార్ఫింగ్ చేసి అసభ్యంగా వాట్సాప్ గ్రూపులో సమాచారం పంపిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నాయకులు నారాయణ మూర్తి ఇచ్చిన ఫిర్యాదు పై తాడేపల్లి పోలీస్ స్టేషన్ లో ఆరు కేసులు నమోదైనట్లు గురువారం ఆయన తెలిపారు. మరో మూడు కేసులు విచారించి నమోదు చేస్తామని పోలీస్ అధికారులు చెప్పినట్లు చెప్పారు. కేసులు నమోదు చేతల్లో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌ను కలిసిన నేపథ్యంలో కదలిక వచ్చినట్టు వివరించారు. తాడేపల్లి సిఐ కళ్యాణ్ రాజును కలిసిన వారిలో ముదిగొండ ప్రకాష్ తదితరులున్నారు.

నులకపేటలో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి- తాడేపల్లి : తాడేపల్లి సిఐ బత్తుల కళ్యాణ్ రాజు ఆధ్వర్యంలో గురువారం రాత్రి తాడేపల్లి పట్టణంలోని నులకపేటలో పోలీస్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అనుమానితులను ప్రశ్నించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తుంటే తమ దృష్టికి తేవాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని చెప్పారు.

రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి- తాడేపల్లి : ఉండవల్లిలో కొండ పోరంబోకు, ఇరిగేషన్ స్థలాలతోపాటు వివిధ ప్రభుత్వ స్థలంలో ఉంటున్న పేదలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని సిపిఎం నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, యు పార్టసారథి, టి శివయ్య, వీ మస్తాన్రావు, ఓ శ్రీనివాసరావు, చెంచయ్య, ఎం సాంబశివరావు లు శుక్రవారం ఉండవల్లి వచ్చిన ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు మెమొరాండం అందజేశారు. 1998 లోనే అప్పటి ప్రభుత్వం గ్రామ సర్వేనెంబర్ 211/2ఎ, 1 ఎ మరియ3 పరిధిలోని నివాస స్థలాలకు పట్టాలు ఇచ్చిన సంగతిని మంత్రికి గుర్తు చేశారు. దీనిపై మంత్రి సమాధానాన్ని దాటవేశారు.

ఐలమ్మ కమ్యూనిటీ హాలుకు సహకారం

ఈ సందర్భంగా రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం భాస్కరయ్య ఆధ్వర్యంలో తాడేపల్లిలో నిర్మిస్తున్న చాకలి ఐలమ్మ రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని, అందుకు తగిన నిధులు కేటాయించాలని ఉండవల్లి వచ్చిన ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన మంత్రి నారా లోకేష్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించి త్వరలోనే పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. రజక వృత్తి దారుల సంఘం నాయకులు మంత్రి ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొజ్జ సుబ్బా రావు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, పార్థసారథి పాల్గొన్నారు.

15 శాతం వృద్ధి కోసం 3 రంగాలు

- ఉద్యాన, పశుపోషణ, పర్యాటకంపై ప్రత్యేక దృష్టి
- పశువుల కొనుగోలుకు డ్వాక్రా మహిళలకు అదనంగా సాయం
- అనుమతులున్న పరిశ్రమల ప్రారంభం
- కోళ్ల ఫారాల పున: ప్రారంభానికి చర్యలు
- పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఈ ఆర్థిక సంవత్సరంలో 15 శాతం వృద్ధి లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టనున్నామని, ప్రధానంగా ఉద్యాన పంటలు, పశు పోషణ, పర్యాటక రంగాల్లో అభివృద్ధిపై దృష్టి పెడతామని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు చెప్పారు. ఈ మేరకు నరసరావుపేట కలెక్టరేట్‌లో గురువారం మీడియాతో మాట్లాడారు. పండ్లు, కూరగాయలు, పూల తోటల విస్తీర్ణం పెరిగితే రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందన్నారు. డిసెంబర్-మార్చి కాలంలో షేడ్ నెట్లు నిరుపయోగంగా మారుతున్న నేపథ్యంలో మొక్కలు పెంచితే అదనపు ఆదాయం వస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయం విస్తీర్ణం 50 వేల ఎకరాలకు పెంచడాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. పశువుల పెంపకం, పాల ఉత్పత్తి, మాంసం ఉత్పత్తిలో వృద్ధి సాధించేందుకు అవకాశాలు పరిశీలిస్తున్నామని, చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు. పాడి రంగంలో ఉన్న స్వయం ఉపాధి సంఘాల మహిళలకు అదనపు పశువుల కొనుగోలుకు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. కోళ్ల ఫారాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, నిలిచిపోయిన కోళ్ల ఫారాలు మళ్లీరిగి ప్రారంభించేందుకు సహకారం అందిస్తామని తెలిపారు. అనుమతులన్నీ పొంది వివిధ కారణాలతో నిలిచిపోయిన పరిశ్రమలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఒక కొత్త హోటల్ ఏర్పాటు చేసి జిల్లాకు వచ్చే పర్యాటకులను ఆకర్షించేందుకు పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి త్వరలోనే టెండర్లు పిలవనున్నామన్నారు. కలెక్టర్ కార్యాలయ భవనం ఏర్పాటుతో పాటు కలెక్టరేట్‌కు సమీపంలోని రాజీవ్ గృహ కల్ప నిర్మాణాలు, ఉద్యోగులకు వసతికి ఏర్పాటుకు పరిశీలన చేస్తున్నామన్నారు.

జిల్లాలో నమోదైన బర్డ్ ఫ్లూ విషయంలో ప్రజలు ఆందోళన చెందవద్దని, అధికారులు అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారని అన్నారు. వేసవి నేపథ్యంలో పశువులకు ఇబ్బంది కలగకుండా జిల్లాలో 343 నీటితొట్లు నిర్మిస్తామని, 10-15 రోజుల్లో పనులు పూర్తవుతాయని చెప్పారు. అన్ని చెరువుల్లో నీరు నింపడం, కాల్వల పూడిక తీత పనులు చేపడతామన్నారు. ప్రస్తుతం 7 చెరువుల్లో 25-50 శాతం, 32 చెరువుల్లో 50-75 శాతం నీటి లభ్యత ఉందన్నారు. 6253 కిలోమీటర్ల మేర కాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ప్రారంభమైన 1100 నీటి కుంటల పనులను జూన్ 8 నాటికి పూర్తి చేస్తామని, మొత్తం 6500 నీటి కుంటల నిర్మాణం లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. ఉపాధి హామీ కూలీల వేతనం రూ.300కు తగ్గకుండా, 54.55 లక్షల పని దినాలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. వంద రోజుల పని పూర్తయిందనే ఉద్దేశంతో కొందరు పనులు కోరడం లేదని, కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమైనందున మళ్లీ వంద రోజుల కోటా ప్రారంభమైందని తెలిపారు. అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలు ఈత పేరుతో ప్రాణాల మీదకు తెచ్చుకోకుండా కనిపెట్టుకోవాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మినరల్ వాటర్ అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి ఇ.మురళి, డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి పాల్గొన్నారు.




మాచర్ల 'బార్' అధ్యక్ష, కార్యదర్శులుగా రమేష్‌బాబు, శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా వై.రమేష్‌బాబు, ఎం.శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోర్టు ఆవరణలో జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా యు.లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శిగా గుంజ వరప్రసాద్, కోశాధికారిగా శ్రీనివాసరావు, లైబ్రేరియన్‌గా ఆర్.శ్రీనివాసరావు, మహిళా ప్రతినిధిగా డి.నాగసంధ్య, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా చల్లా వెంకటేశ్వరరావు, బూసా రాజేష్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సీనియర్ న్యాయవాదులు గట్ల సత్యనారాయణరెడ్డి, కేళం శ్రీనివాసరావు, కొత్తపల్లి డేవిడ్‌రాజు, సిహెచ్ నాగిరెడ్డి, భీమా నరసింహారావు, వై.క్రిష్ణమూర్తి, రామారావు తదితరులు అభినందించారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారంలో ముందుండాలని, కక్షిదారులకు సత్వర న్యాయం అందించే ప్రక్రియలో క్రియశీలకంగా నడుచుకోవాలని ఆకాంక్షించారు.




యడ్లపాడు విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - యడ్లపాడు

సైన్స్ డే సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన యురేకా సైన్స్ ఎక్స్ పో పోటీల్లో యడ్లపాడు నారాయణ స్కూల్ విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీలో జిల్లాస్థాయి మొదటి బహుమతి సాధించారు. జెడ్‌పి పాఠశాల విద్యార్థులు పర్యావరణం విభాగంలో మొదటి బహుమతి సాధించారు. వీరికి బహుమతులను స్థానిక నారాయణ స్కూల్‌లో ఎంఇఒ నాగరత్నం గురువారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో డి.వెంకట్రావు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డి.బుజ్జిబాబు, చెరుకూరి సృజన, జిల్లా చుక్క విన్సెంట్‌పాల్, పివి సుబ్బారావు పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌లో నమోదైన కందుల కొనుగోలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన 26,908 హెక్టార్ల కందిపంట నుండి 50,879 మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చునని అంచనా వేశామని, ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులు నుండి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాళ్‌కు రూ.7550 చొప్పున కొనుగోలు చేయుటకు 350 రైతు సేవ కేంద్రాల పరిధిలో ఏర్పాటు చేసి ఎ.పి.మార్క్‌ఫెడ్, డిసిఎంఎస్ ప్రొక్యూర్మెంట్ ఏజెన్సీ బ్రాంచీల ద్వారా కొనుగోలు చేస్తారని పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ. మురళి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 176 కేంద్రంలో 5,443 మంది రైతులు కంది పంటను ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకునేందుకు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని, 1,772 మంది నుండి 3,502 మెట్రిక్ టన్నుల కందులను (రూ.26.44 కోట్లు) కొనుగోలు చేశామని తెలిపారు. రబీలో 4,572 హెక్టార్లలో కంది సాగు చేసిన రైతులు రైతుసేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి రిజిస్ట్రేషన్లు చేసుకొని ప్రభుత్వ మద్దతు ధరకు కందులను అమ్ముకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు రైతు సేవా కేంద్రంలో లేదా సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ శాఖ, గ్రామ వ్యవసాయ/ఉద్యాన/పట్టు పరిశ్రమ సహాయకులను సంప్రదించాలని పేర్కొన్నారు.

పశు సేవా డ్రైవర్లు, వైద్య సిబ్బందిని కొనసాగించాలి

నిర్వహణ ఏజెన్సీని మార్చినా పని చేసేవారికి అన్యాయం చేయొద్దు : సిఐటియు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మొబైల్ అంబులేటరీ వెటర్నరీ క్లినిక్స్ ప్రాజెక్టు కింద గత ప్రభుత్వం 2022లో రూ.240.69 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో నియోజకవర్గానికి రెండు చొప్పున 340 సంచార పశువైద్య ఆరోగ్య సేవా రథాలను ప్రవేశ పెట్టిన సంచార పశు వైద్య ఆరోగ్యసేవా రథాలు ప్రస్తుతం జివికె ఇఎంఆర్ఐ సంస్థ నుండి భవ్యకు బదలాయిస్తున్న నేపథ్యంలో పథకం ఆరంభంలో నియమించిన సిబ్బందికి ఉద్యోగ భద్రతతోపాటు కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులునాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో గురువారం 1962 అంబులెన్స్ డ్రైవర్లతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. వాహనాలను ప్రభుత్వం వారికి అనుకూలమైన ఏజెన్సీలకు అప్పగించడంపై తమకేమీ అభ్యంతరం లేదని, అయితే రాష్ట్ర వ్యాప్తంగా రెండు విడతల్లో ఇప్పటి వరకు పని చేసిన డ్రైవర్లను, వైద్యులను, సిబ్బందిని కొనసాగించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న సిబ్బందిని తొలగించి కొత్తవారిని నియమించే ఆలోచన విరమించుకోవాలన్నారు. మొదటి విడతలో పని చేసిన డ్రైవర్లు, వైద్య సిబ్బంది 2 నెలల నుండి పని లేక వేతనాల్లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నెల 15 నుండి భవ్య ఏజెన్సీ ద్వారా పథకం సేవలు కొనసాగుతాయని ప్రభుత్వం ప్రకటిస్తూనే 165 వాహనాలను సంచార వైద్య సేవలకు, మిగిలిన 175 వాహనాలను 104 తరహాలో రోజుకో గ్రామంలో వైద్యశిబిరాలు నిర్వహించేలా మార్పు చేశారని, సిబ్బంది కొనసాగింపు విషయంలో మాత్రం స్పందించలేదని, ఇది సరికాదని అన్నారు. ఇప్పటి వరకు పని చేసిన సిబ్బందిని కొనసాగించడం ద్వారా పశువులకు వైద్య సేవలు సమర్థవంతంగా అందడంతో పాటు ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డ్రైవర్లు బి.గోవింద్ నాయక్, రమణబాబు, షేక్ షరీఫ్, పద్మారెడ్డి పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ఉద్యోగులు, నాయకులు

నేటి నుండి నాటకోత్సవాలు

- పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం ఆధ్వర్యంలో యడ్లపాడులో 22వ జాతీయ స్థాయి పోటీలు
- పూర్తయిన ఏర్పాట్లు - ఇంటింటికీ వెళ్లి ఆహ్వాన పత్రికలిచ్చిన నిర్వాహకులు

ప్రజాశక్తి - యడ్లపాడు

పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం ఆధ్వర్యంలో మండల కేంద్రమైన యడ్లపాడులో శుక్ర, శని, ఆదివారాల్లో 22వ జాతీయ స్థాయి నాటి పోటీలను నిర్వహించ నున్నారు. ఇందుకుగాను రెండు తెలుగు రాష్ట్రల నుంచి 10 నాటికలను ఎంపిక చేశారు. ఉత్తమంగా నిలిచిన ప్రథమ నాటికకు రూ.28 వేలు, ద్వితీయ నాటికకు రూ.26 వేలు, తృతీయ నాటికకు రూ.24 వేలు బహుమతి, ప్రదర్శన పారితోషికం రూ.18 వేలు, ప్రతి నాటిక రచయితకు రూ.వెయ్యి, ప్రతి నాటిక దర్శకుడికి రూ.వెయ్యి, ఐదుగురు ఉత్తమ నటీనటులకు రూ.వెయ్యి, మరో ఐదుగురు ఉత్తమ సహాయనటులకు రూ.500, ఉత్తమ దర్శకుడికి రూ.3 వేలు, ఉత్తమ రచయితకు రూ.2 వేలు, ఉత్తమ రంగాలంకరణ, సంగీత దర్శకులు, ఆహార్యం ఒక్కొక్కరికీ రూ.వెయ్యి, కళాకరులందరికీ జ్ఞాపికలు ఇవ్వనున్నట్లు వేదిక (తెలుగు నాటక రంగం సమ్మేళనం) అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. కళాకారుణులకు ఆడపడుచు సత్కారం చేస్తామన్నారు.



ఇంటింటికీ వెళ్లి ఆహ్వాన పత్రికలు ఇస్తున్న పరిషత్ నిర్వాహకులు

మూడ్రోజులపాటు పండుగ వాతావరణంలో నిర్వహించే ప్రదర్శనల కోసం ప్రత్యేక ఏర్పాట్లను నిర్వాహకులు చేశారు. ప్రేక్షకులు, అతిథులకు గ్యాలరీల ఏర్పాటు చేశారు. నాటక రచయితలు, దర్శకులు, కళాకారుల ఫొటోలతో ఫ్లెక్సీలను రూపొందించి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేశారు. పోస్టర్లు అంటించారు. ఆహ్వాన పత్రికల్ని తెలంగాణ రాష్ట్రం పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అయిన ఆరెకపూడి గాంధీ మనవడు అద్వైత్‌గాంధీ ద్వారా పరిషత్ నిర్వాహకులు ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి అందించి ప్రదర్శనలకు ఆహ్వానించారు. ప్రతిరోజు పోటీలను వీక్షించేందకు వచ్చిన ప్రేక్షకులకు అల్పాహార విందుతోపాటు ప్రదర్శన అనంతరం రోజుకు 30 మంది చొప్పున మూడ్రోజుల్లో 90 మందికి కూపన్లతో లక్కీడ్రా తీసి బహుమతుల్ని అందించనున్నారు. ఆహ్వాన పత్రికల పంపిణీలో కళానిలయం అధ్యక్షులు ముత్తవరపు సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి ముత్తవరపు రామారావు, పద్మారావు, ఉపాధ్యక్షులు జరుగుల శంకరరావు, కోశాధికారి నూతలపాటి మాధవరావు పాల్గొన్నారు.

మద్దతు ధరకే జొన్న, మొక్కజొన్నను కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే జొన్న మొక్కజొన్న పంటలను కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివ శంకర రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ మేరకు ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో బుధవారం రైతు సంఘం నాయకులతో కలిసి, మొక్క జొన్న పంటలను పరిశీలన చేసి, రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ ఇప్పటికే చిర్రావూరు, ప్రాతూరు గ్రామాలలో మొక్కజొన్న రైతులు మొక్కజొన్న కండెలను విరిచి, కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మేందుకు ఎదురు చూస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మొక్కజొన్న మద్దతు ధర 2200 లకు, జొన్న 3125 లకు రైతుల వద్ద నుండి కొనుగోలు చేయాలని అన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు పెట్టడం ఆలస్యం అవ్వడంతో ప్రైవేట్ వ్యాపారులకు మొక్కజొన్న రైతులు క్వింటా 1900 చొప్పున నష్టానికి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. చిర్రావూరు గ్రామంలో సుమారు 280 ఎకరాలలో మొక్కజొన్న, 80 ఎకరాలలో జొన్న పంట సాగు చేస్తున్నారని ప్రభుత్వ అధికారులు చెప్తున్నారని, అసైన్డ్ భూములలో కూడా మొక్కజొన్న పంట సుమారు 200 ఎకరాలు ఉంటుందని ఆయన అన్నారు. అసైన్డ్ భూములలో మొక్కజొన్న, జొన్న వేసిన రైతుల పంటలను ఈక్రాప్ నమోదు చేసి, కొనుగోలు చేయాలని, జొన్న మొక్కజొన్న రైతులను ఆదుకునే విధంగా చిర్రావూరులో తక్షణమే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం తాడేపల్లి



చిర్రావూరిలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు



అడిషనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించిన కేరళ రైతు బృందం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

'ఆంధ్ర ప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) ద్వారా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన కేరళ రైతుల బృందం సంతృప్తిని వ్యక్తం చేసింది. రెండవ రోజు గురువారం గుంటూరు జిల్లాలో మంగళగిరి, కొల్లిపర మండలాల్లో పర్యటించింది. వీరిని జిల్లా డిపిఎం రాజకుమారి, టీ ఎల్ శ్రీనివాసు, టీ ఎల్, ఎన్ ఆర్ వో హుమాయూన్ స్వాగతించారు. కేరళ రైతు బృందం తొలుత మంగళగిరి మండలంలోని నూతక్కి గ్రామంలో రైతు శ్రీనివాస్ రెడ్డి క్షేత్రాన్ని సందర్శించి ప్రకతి వ్యవసాయం విధానంలో సాగు చేస్తున్న అరటి ఎ గ్రేడ్ నమూనా మరియు అంతర పంటలను పరిశీలించారు. ఆకుకూరలు, కూరగాయల పంటల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం గురించి ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి, థిమాటిక్ లీడ్ శ్రీనివాసులు వివరించారు. కౌలు రైతు మల్లికార్జున సాగుచేసిన బంతి, రాటూన్ రకం అరటి పంటలను పరిశీలించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం సాగు విధానాలు, పెట్టుబడి, రాబడి తదితర విషయాలను రైతు కుటుంబంతో అడిగి తెలుసుకున్నారు. నూతక్కిలో కొండా ఉషారాణి ఎన్‌పిఎం షాప్‌ను కూడా పరిశీలించి అక్కడ లభ్యమవుతున్న వివిధ రకాల ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొల్లిపర మండలంలోని దావులూరిపాలెం గ్రామంలో హెల్త్ అండ్ న్యూట్రిషన్ విధానాలను, ప్రకృతి వ్యవసాయంలో మహిళా సంఘాల సభ్యుల పాత్రను గురించి తెలుసుకున్నారు. రైతు వసంతకు చెందిన పసుపు ఎ గ్రేడ్ మోడల్, న్యూట్రి గార్డెన్ కేరళ రైతు బృందం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఎపిలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సాగు విధానాలను పరిశీలిస్తున్నామన్నారు. ఏపీసీఎన్ఎఫ్ ద్వారా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన కేరళ రైతుల బృందం సంతృప్తిని వ్యక్తం చేశారని రైతు సాధికార సంస్థ సభ్యులు తెలిపారు.



సమస్యలను పరిష్కరించకుంటే 7 నుండి సమ్మె

ప్రజాశక్తి - మంగళగిరి

కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల ఏడో తేదీ నుండి సమ్మెలోకి వెళతామని క్లాప్ ఆటో డ్రైవర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో గురువారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ కే శకుంతలను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజల నుండి వచ్చే వ్యర్థాలను సమీకరించి డంపింగ్ యార్డులకు నిత్యం తరలించే ఆటో డ్రైవర్ల సమస్యలను పట్టించుకోవడంలేదని విన్నవించారు. స్వచ్ఛ మంగళగిరి అనే ప్రాజెక్టులో వారు కూడా కృషి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే రెండు నెలల నుండి వేతనాలు చెల్లించ లేదని విన్నవించారు. 16 నెలలుగా ఈఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలు అమలు చేయడం లేదని, జీవితంలో మాత్రం కట్ చేస్తున్న సౌకర్యాలు అందడం లేదని విన్నవించారు. సకాలంలో జీతాలు వేయకపోవడం లేదని, ఐడి కార్డులు ఇవ్వడం లేదని, ఆప్కాస్ లో చేర్చాలని, ప్రస్తుతం ఇస్తున్న వేతనం రూ.12,500 నుండి రూ.18,500 వరకు పెంచాలని వినతి పత్రంలో కోరారు. డ్రైవర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, ఆటోలు మరమ్మతులు చేయించాలని విన్నవించారు. ఈ సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల ఏడో తేదీ నుండి పనులు ఆపివేసి సమ్మెలోకి వెళతామని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, వివి జవహర్లాల్, సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ, క్లాత్ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు డి శివ, ఎం రవి, యూనియన్ నాయకులు ఎం.యోహన్, బి జె శ్రీకాంత్, ఆర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఇన్‌చార్జి మేయర్

జిఎంసి స్విమ్మింగ్ పూల్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పట్టాభిపురం, రవీంద్ర నగర్‌లోని గుంటూరు నగరపాలక సంస్థ ఈత కొలను (స్విమ్మింగ్ పూల్)ను గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, ఇంచార్జి మేయర్ షేక్.సజిల గురువారం ప్రారంభించారు. గతంలో మరమ్మతులకు గురయ్యిన ఈ స్విమ్మింగ్ పూల్‌ను సుమారు రూ.25 లక్షలతో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మరమ్మతు పనులు స్వల్పకాలంలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. ప్రజలకు అవసరమయ్యే అన్ని వనరులను సమకూర్చటం కోసం కూటమి ప్రభుత్వం ఎప్పుడు ముందు ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, దానియేలు, వేమా విజయ్ కాంత్, వై.సుబ్రహ్మణ్యం, నాగ భూషణం, జెట్టి బాజీ బాబు, దామనచెర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

బొంగారాలబీడు నుండి వసంతరాయపురం మీదుగా శారదా కాలనీ వరకు మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డును 60 అడుగులకు విస్తరించాల్సిన అవరం ఉందని, ప్రజలు సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. గురువారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో కలిసి కౌన్సిల్ సమావేశ మందిరంలో బొంగారాలబీడు రహదారి విస్తరణకు సంబంధించి గహాలు, స్తలాలు కోల్పోతున్న ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణ వల్ల ఈ ప్రాంతంలో రోడ్డు విస్తరణ వలన ఈ ప్రాంతంలో 201 ఆస్తులు ప్రభావితం అవుతున్నాయని, వాటిలో 158 ప్రైవేట్ ఆస్తులు కాగా, 2 జియంసి ఆస్తులు, 4 ఖాళీ స్తలాలు, 2 స్వాధీన అగ్రిమెంట్లు, 7 మతపరమైనవి, 3 బి ఫారాలు, 25 ఎ.ఈ.యల్.సి ఆస్తులు ఉన్నాయన్నారు. వీటికి సంబంధించిన డాక్యుమెంట్లు అందజేస్తే పరిహారం, టిడిఆర్ బాండ్లు త్వరగా అందేలా చూస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో నిర్వహించాల్సిన అభివద్ధి పనులు గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని, ప్రస్తుతం తమ ప్రభుత్వం వచ్చాక అభివద్ధి పనులు వేగవంతంగా నిర్వహిస్తుందన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, రోడ్ల విస్తరణ చేపట్టబోతున్నామని, ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వస్తాయన్నారు. అందుకు తగ్గట్టుగా రోడ్లను అభివద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, యస్.ఈ నాగ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్లాంట్‌ను బహుకరించిన వ్యాపారవేత్త పురుషోత్తం, కుటుంబ సభ్యులు

ఎంవిఎస్‌కె స్కూల్‌కు వాటర్ ప్లాంట్ బహూకరణ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అడవి తక్కెళ్లపాడు, సుందరయ్య కాలనీలోని ప్రొఫెసర్ ఎంవిఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ స్కూల్లో వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. గుంటూరులోని ప్రముఖ వ్యాపారవేత్త సానిశెట్టి పురుషోత్తం వారి తల్లిదండ్రులు సానిశెట్టి వెంకయ్య, వెంకాయమ్మ జ్ఞాపకార్థం రూ.85వేల విలువైన వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్‌ను స్కూల్‌కు బహుకరించారు. రోజుకు రెండు వేల లీటర్ల నీటిని శుద్ధి చేసి, అన్ని రకాల పోషకాలను అందించే ప్లాంట్‌ను స్కూల్లో ఏర్పాటు చేసినందుకు స్కూల్ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. నిరుపేదలకు విద్యను అందిస్తున్న పాఠశాలకు ఇటువంటి సాయం అందించటం ఆనందంగా ఉందని పురుషోత్తం, వారి కుటుంబ సభ్యులు అన్నారు. కార్యక్రమంలో పురుషోత్తం సతీమణి సుబద్ర, కుమారుడు సతీష్, కోడలు దుర్గాదేవి, మనువరాలు లక్ష్మీప్రియ, మనువడు శరణ్, హ్యాపీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.కోటేశ్వరరావు, సభ్యులు అశోక్‌బాబు, బి.శ్రీనివాసర్, నరసింహారావు, కైలాష్, స్కూల్ సెక్రెటరీ ఎం.ఉపేంద్ర, ప్రిన్సిపాల్ ఎన్.తాండవకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కె.దివ్య పాల్గొన్నారు.

ఒంగోలు జాతి గిత్తలను సంరక్షించుకోవాలి

గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు - కనువిందు చేస్తున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యేలు

ఒంగోలు జాతి ఎడ్ల గిత్తలను సంరక్షించు కోవాల్సిన ఆవశ్యకత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. తెనాలి చెంచుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి బండలాగుడు ఆరవరోజు ఎడ్ల బల ప్రదర్శన పోటీల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలపాటి శివరామ కృష్ణయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన పోటీలకు మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్, సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాజు వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం చైర్మన్ డి రాకేష్, వ్యవసాయ విద్యాలయం లాం డైరెక్టర్ సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఫ్లెడ్ లైట్ల వెలుతురులో జరుగుతున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీలకు వేలాదిగా ప్రేక్షకులు హాజరయ్యారు. సంస్కృతి సంప్రదాయాలకు నెలవైన ఎడ్ల పోటీలను తెనాలిలో నిర్వహించటం ముదావహమని గన్నవరం శాసన సభ్యులు యార్లగడ్డ వెంకటరావు అన్నారు. ప్రాచీనకాలం నుంచి ఒంగోలు జాతి ఎడ్లు హుందాకి చిహ్నంగా ఉన్నాయని గుర్తుచేశారు. మైలవరం శాసన సభ్యులు వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ బ్రెజిల్ దేశంలో అత్యధిక ధర పలకడం ఒంగోలు జాతి గిత్తలకున్న ప్రాముఖ్యత తెలుస్తుందన్నారు. సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత గాంచిన ఎడ్లను పోషిస్తున్న పశు పోషకులు అభినందనీయులన్నారు. మాజీ మంత్రి, సీనియర్ టిడిపి నాయకులు దేవినేని ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ ఆలపాటి తండ్రి స్ఫూర్తితో, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం రోజున ఎడ్ల బల ప్రదర్శన నిర్వహించడం సంతోషమన్నారు. దేశ విదేశాల్లో ఒంగోలు జాతి ఎడ్లకు గుర్తింపు ఉందని, వాటిని సంరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్ కోయ సుబ్బారావు, వ్యవసాయ విద్యాలయం లాం డైరెక్టర్ సత్యన్నారాయణ తదితరులు మాట్లాడారు. బుధవారం సబ్ జూనియర్ విభాగంలో నిర్వహించిన ఎడ్ల బల ప్రదర్శన పోటీల్లో విజేతలకు మంత్రి బహుమతులు ప్రధానం చేశారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్ళ పుచ్చకాయల శేషాద్రి ఎడ్లజతకు ప్రథమ బహుమతి రూ.70వేలు, బాపట్ల జిల్లా నగరం మండలం మంతెనవారిపాలెం కు చెందిన విజయలక్ష్మి డైరీ ఫార్మ్ మేక ప్రతిక్ ఎడ్ల జతకు రెండవ బహుమతి రూ.60వేలు, కృష్ణాజిల్లా, పెనమలూరు మండలం, పెద్దపులిపాక ప్రాంతానికి చెందిన జి.ఎస్.ఆర్ బుల్స్ గరికపాటి శ్రీధర్ ఎడ్ల జతకు మూడవ బహుమతి రూ. 50వేలు అందజేశారు. నాలుగో బహుమతి రూ. 40 వేలు, ఐదవ బహుమతి రూ. 30 వేలు, ఆరవ బహుమతి రూ.25 వేలు, ఏడవ బహుమతి రూ. 20 వేలు, ఎనిమిదో బహుమాతి రూ. 15 వేలు, తొమ్మిదో బహుమతి రూ 10 వేలు నగదు ప్రోత్సాకాలు అందించారు. జూనియర్స్ విభాగంలో పోటీలు రసవత్తరంగా కొనసాగు తున్నాయి.



పోటీలో ఒంగోలు జాతి గిత్తలు



మాట్లాడుతున్న జూలకంటి గౌతమ్‌రెడ్డి

వరికపూడిసెల పూర్తిచేసి తీరుతాం

ప్రజాశక్తి - మాచర్ల :

పల్నాడు ప్రజల దశాబ్దాలకలైన వరికపూడిసెల ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి తీరుతామని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి కుమారుడు జూలకంటి గౌతమ్‌రెడ్డి అన్నారు. గురువారం మండాది రోడ్డులోని శ్రీ రామకష్ణ సేవా సమితి వారి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద సేవాశ్రమంలో పదవ తరగతి పూర్తయిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్ సెంటర్‌ను గౌతమ్ రెడ్డి, జూలకంటి అక్కిరెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలకు పూర్తిగా సహకరిస్తామని, నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే ఎమ్మెల్యే జూలకంటి ప్రధాన లక్ష్యమని వారు వెల్లడించారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులందరూ పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ, స్పోకెన్ ఇంగ్లీష్ లకు సంబంధించిన ఈ ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. శ్రీ రామకృష్ణ సేవా సమితికి ఈ సందర్భంగా ఆర్థిక సహాయం ప్రకటించారు. అనంతరం గౌతమ్ రెడ్డి, అక్కిరెడ్డిను శ్రీరామకష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమం లో వివేకానంద ఆశ్రమ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ మాచర్ల పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఇంగ్లీష్ ఎండేవర్ అవార్డుకు నలుగురు విద్యార్థులు ఎంపిక

స్టేట్ ర్యాంకులు సాధించిన సెయింట్ ఫిలోమినాస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మండల కేంద్రం రొంపిచర్లలో గల సెయింట్ ఫిలోమినాస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఇంగ్లీష్ ఎండేవర్ అవార్డుకు ఎంపికయ్యారని స్కూల్ సెక్రట రస్పాండెంట్ కెపి.జైన్, డైరెక్టర్ కెపి. లిస్సిజోష్ తెలిపారు. ఇటీవల ఆ అవార్డుకు సంబంధించి నిర్వహించిన పరీక్షలో తమ స్కూల్‌కు చెందిన ఒకటవ తరగతి విద్యార్థిని జె.ప్రణవి స్టేట్ 5వ ర్యాంక్, రెండవ తరగతి విద్యార్థి షేక్ నూసీన స్టేట్ 3వ ర్యాంక్, రెండవ తరగతి విద్యార్థి టి.కాల అన్విత స్టేట్ రెండవ ర్యాంక్, 5వ తరగతి విద్యార్థి వై.యజ్విత శ్రీ స్టేట్ 4వ ర్యాంక్, సాధించారని అన్నారు. ఈ సందర్భంగా మండల విద్యా వనరుల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో స్టేట్‌ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఎంఇఓ-2 డి.బ్రహ్మేశ్వరరావు, సిబ్బంది అభినందించారు.

అనాథ మృతదేహానికి అంతక్రియలు

ప్రజాశక్తి - వినుకొండ

అనాథ మృతదేహానికి అంతక్రియలు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు మానవ సేవా సమితి సభ్యులు. వినుకొండ పట్టణం ప్రభుత్వ ఆసుపత్రిలో అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించిన వ్యక్తి మృతదేహానికి అంతక్రియలు చేసేందుకు సీనియర్ కౌన్సిలర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, మానవ సేవా సమితి అధ్యక్షులు పివి సురేష్‌బాబు ఆధ్వర్యంలో హెల్పింగ్ హార్ట్ సమస్త యువకులు ముందు కొచ్చారు. ఈ సందర్భంగా పివి సురేష్‌బాబు మాట్లాడుతూ అనాథలకు అభాగ్యులకు సంస్థ భ్యులు అండగా నిలిచి చేతనైన సహాయ సహకారాలు అందిస్తూ స్వచ్ఛంద సేవలు అందిస్తు న్నారని తెలిపారు. అంత్యక్రియల్లో సంస్థ సభ్యులు పువ్వాడ కృష్ణ, షేక్ సర్కార్ నాగూర్, సయ్యద్ జాబీర్, వట్టి కోటి ప్రసాద్, షేక్ యూసఫ్ పాల్గొన్నారు.

చలి వేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

స్థానిక ఫిల్టర్ హౌస్ వద్ద ఇరిగేషన్ శాఖ సూపరింటెండెంట్ మీసాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం స్థానిక టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా ఉచితంగా చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొబ్బిలి చంద్రశేఖర్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు ఊరే మార్క్, కట్టారాజు, జయరావు, రాంచంద్, శ్రీను పాల్గొన్నారు.

ఓటర్ల మార్పులు చేర్పుల ప్రక్రియ పారదర్శకంగా జరగాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



సమావేశంలో కలెక్టర్

జిల్లాలో ఈ ఏడాది జనవరి-6 నుండి నేటి వరకు ఓటర్ల జాబితా సవరణలో భాగంగా అన్ని రకాల ఫారాల క్లైములు 2995 ఉన్నాయని, అందులో నూతన ఓటర్లు-296, తొలగింపులు - 2280, మార్పులుకు సంబం ధించి 416లుగా ఉన్నాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.అరుణ్ బాబు తెలిపారు. గురు వారం ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం చేపడుతున్న పలు విధానాలను ఎప్పటికప్పుడు తెలియ జేసేలా ప్రతి నెల సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎన్నికల ముందు, ఎన్నికల సమయంలో, ఎన్నికల తరువాత జరిగిన సంఘటనలపై ప్రతి నెలా నివేదిక అందించాలన్నారు. ఓటర్లుగా నమోదు ప్రక్రియ నిరంతర ప్రక్రియ అన్నారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ వంతు సహకారం అందించడంతో పాటు పోలింగ్ బూతుల వారీగా ఏజంట్లను నియమించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి మురళి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జాబితాపై అశ్రద్ధ వద్దు

ప్రజాశక్తి - మాచర్ల



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ గాయత్రీదేవి

బిఎల్ఓలు ఓటర్ల జాబితా పట్ల అప్రమత్తంగా ఉండాలని డిప్యూటి కలెక్టర్ గాయత్రీదేవి హెచ్చరించారు. మాచర్ల నియోజకవర్గ పరిధిలోని బిఎల్ఓలందరికీ స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటి కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారిలో బిఎల్ఓల పనితీరు తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. చేర్పులు, మార్పులు, తొలగింపులపై నిబంధనలను తెలియజేశారు. అనంతరం బిఎల్ఓలకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ డి.వేణుబాబు, తహశీల్దార్స్ కిరణ్‌కుమార్, బాషా తదితరులు పాల్గొన్నారు.

నమోదులో జాగ్రత్తలు తీసుకోవాలి : మద్దాల ఉమాదేవి



మాట్లాడుతున్న అధికారి మద్దాల ఉమాదేవి

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఓటర్ల నమోదు, తొలగింపుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి మద్దాల ఉమాదేవి అన్నారు. గురువారం పెద్దకూర పాడులోని షాదీఖానాలో బూతులెవల్ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అచ్చంపేట తహశీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ నమోదులో సర్వీస్ ఓటర్లు, ఓవర్సీస్ వాటర్లు, సీనియర్ సిటిజెన్స్, పీడబ్ల్యుడి ఓటర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. డ్రాఫ్ట్, ఫైనల్ పబ్లికేషన్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే జిల్లా అధికారుల నుండి తాఖీదులు అందుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రూల్స్ ప్రకారం పని చేయాలన్నారు. కార్యక్రమంలో పెదకూరపాడు తహశీల్దార్ ధనలక్ష్మి, క్రోసూరు తహశీల్దార్ నాగరాజు, అమరావతి తహశీల్దార్ దానియేలు, బెల్లంకొండ తపశీల్దారు బేగం పాల్గొన్నారు.

రసాయనిక పరీక్షల కోసం మద్యం శాంపిల్స్ సేకరణ

ప్రజాశక్తి-ఈపూరు : ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బొల్లాపల్లి, రొంపిచర్ల ఈపూరు మండలాలలో రసాయనిక పరీక్షల నిమిత్తం తొమ్మిది మద్యం సీసాలను సేకరించినట్లు ఎక్సైజ్ సీఐ డి వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. కల్లులో ఎటువంటి కల్తీ జరగకుండా నివారించడం కోసం ఆయా మండలాలలో పది కల్లు శాంపిల్స్ రసాయన పరీక్షల కోసం సేకరించామన్నారు. బొల్లాపల్లి మండలంలో మద్యం బెల్టు షాపులకు సంబంధించి 12 కేసులు, రొంపిచర్ల మండలంలో 18 కేసులు, ఈపురు మండలంలో 15 కేసులు నమోదు చేసి 93 లీటర్ల మద్యం సీజ్ చేయడం జరిగిందన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై నాలుగు కేసులు, సారాయి సంబంధించి రెండు కేసులు నమోదు చేశామన్నారు. నవోదయం 2 లో భాగంగా నాటు సారాకి వ్యతిరేకంగా గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినట్లు సిఐ తెలిపారు.

ప్రజలకు చట్టాల గురించి వివరించండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి

ప్రజలకు చట్టాలు గురించి వివరించాలని సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ ఛైర్మన్ మరియు సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి.విజయ కుమార్ రెడ్డి పారా లీగల్ వాలంటీర్లకు సూచించారు. సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ ఆధ్వర్యంలో గురువారం సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి న్యాయస్థాన ప్రాంగణంలో ఉన్న మండల న్యాయసేవాధి కార కమిటీ కార్యాలయంలో నూతనంగా నియమించబడిన పారా లీగల్ వాలంటీర్ల (పి.ఎల్.వి)ల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ న్యాయమూర్తి వి.విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ పారా లీగల్ వాలంటీర్ బాధ్యతతో పని చేయాలన్నారు. చట్టాలను గురించి వీరికి తెలియజేశారు. శిక్షణా తరగతుల్లో ముందుగా ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు లీగల్ సర్వీసెస్ అథారిటీస్ చట్టం, 1987 గురించి తెలియజేశారు. మరో ప్యానల్ న్యాయవాది గంటా వెంకట శివ గహహింసా చట్టం మరియు భరణం చట్టం గురించి తెలియజేశారు. మరో ప్యానల్ న్యాయ వాది బి.ఎల్. కోటేశ్వరరావు సివిల్ వివాదాలు, అనేక సివిల్ చట్టాలను గురించి తెలియజేశారు.

ఎగువ పల్నాడు పారిశ్రామికంగా ఎదుగుతోంది : ఎమ్మెల్యే జూలకంటి

ప్రజాశక్తి - మాచర్ల :



ఉద్యోగ నియామక పత్రాలు పొందిన వారితో ఎమ్మెల్యే

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాజకీయాలకు అతీతంగా యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక శ్రీకాసుబ్రహ్మానందరెడ్డి డిగ్రీ కళాశాలలో అమర రాజా సంస్థ ఆధ్వర్యంలో జేబీఆర్ మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు ప్రాంతం పారిశ్రామి కంగా పురోగమించేందకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకష్ణదేవరాయలు ఎంతో కృషిచేస్తున్నారని, ఆయనతో కలిసి ఎన్నో పరిశ్రమల స్థాపలనకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే జూలకంటి వెల్లడించారు. అనం తరం మెగా జాబ్ మేళాలో 600 మంది నిరుద్యోగ యువత రిజిస్ట్రేషన్ చేసుకోగా, ఎంపికైన 380 మందికి ఎమ్మెల్యే జూలకంటి కంపెనీ ఎంపిక ధ్రువపత్రాలను అందుకున్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఎంఇఒ

నవోదయకు దొడ్లేరు శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - క్రోసూరు

జవహర్ నవోదయ విద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి నిర్వహించిన 6వ తరగతి ప్రవేశ ఫలితాల్లో క్రోసూరు మండలంలోని దొడ్లేరు శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్‌కు చెందిన ఆవుల శివ ధనుష్ రెడ్డి ఎంపికైనట్లు క్రోసూరు మండల ఎంఇఒ ఏకుల ప్రసాద రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ఎంఇఒ కార్యాలయంలో విద్యార్థి శివ ధనుష్‌కు బహుమతి బహూకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పొదలకూరులోని దొడ్లేరు శ్రీ చైతన్యపబ్లిక్ స్కూల్ డైరెక్టర్ పాణెం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు రాంబాబు, ఎంఈఓ 2 గణేష్ , సారధి మాస్టారు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్వరూప

ప్రజల దాహార్తిని తీర్చటానికి దాతలు ముందుకు రావాలి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ :

వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చటానికి దాతలు ముందుకు రావాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అఫీషియల్ చైర్ పర్సన్ సిహెచ్ స్వరూప అన్నారు. పట్టణంలోని సాగర్ రోడ్డులో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. స్వరూప మాట్లాడుతూ ఈ యేడాది ముందుగానే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్నాయని, ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ కరుణాకర్‌బాబు, మేనేజర్ బలరాంరెడ్డి, సూపర్వైజర్ టిసిహెచ్ అంజిరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ టి నరసింహారావు, సీఈవో ఇనకంటే కోటయ్య, సూపరిం టెండెంట్ షేక్ రహంతుల్లా, సోమరౌతు బ్రహ్మేశ్వరరావు, రాజసాగర్ రెడ్డి, కోటిరెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.



శివాజీకి నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఛత్రపతి శివాజీ చిత్ర పటానికి నివాళి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఛత్రపతి శివాజీ తన ప్రజల కోసం నిరంతరం కృషి చేశారని, సామ్రాజ్యాలను ఏర్పాటు చేసుకోవడంలో ఆయన పోరాట స్ఫూర్తి మరువలేనిదని స్వతహాగా ధైర్యవంతుడైన ఛత్రపతి శివాజీ మహారాజ్ 1680 ఏప్రిల్ 3న మరణించారని పలువురు ప్రజా సంఘాల నాయకులు అన్నారు. గురువారం పట్టణంలోని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక కార్యాలయంలో ఆయన వర్ధంతి నిర్వహించారు. ఏప్రిల్ 3న, శివాజీ వర్ధంతిని ప్రతి సంవత్సరం జరుపుకుంటామని, ఛత్రపతి శివాజీ మహారాజ్ శౌర్యం, వీరత్వం, అతని పరిపాలనా నైపుణ్యాలకు ప్ర సిద్ధి చెందిన రాజుగా పేరు పొందారు. కార్యక్రమంలో బి. శ్రీను నాయక్, కౌన్సిలర్ కోటానాయక్, కంభం పాటి దానియేలు ,బి.చిన్న నాయ క్,కొండ్రముట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో చత్రపతి శివాజీ వర్ధంతి గురువారం నిర్వహించారు. చత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అన్నం బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ చత్రపతి శివాజీ విగ్రహాన్ని ప్రతిష్టించిన మహారాష్ట్ర వీధి వారిని అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కొత్త రామకృష్ణ,చెక్క రవికుమార్, దేవరశెట్టి రఘు కిషోర్, ఫిరోజి, శివాజీ, మాజీ వార్డు కౌన్సిలర్ పులహరీ భానుజీ, అశోక్,పవన్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, నరోసోజి, గోవిందరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నాగబాబుని సత్కరించిన చిల్లపల్లి

ప్రజాశక్తి మంగళగిరి



నూతన ఎమ్మెల్సీగా ఎన్నికై ప్రమాణస్వీకారం చేసిన జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబుని గురువారం ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

కవి ఆళ్లకు అబ్దుల్ కలాం ఇండియన్ ఐకాన్ అవార్డు

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన కవి, రచయిత డాక్టర్ ఆళ్ల నాగేశ్వరరావు ఎపిజె అబ్దుల్ కలాం ఇండియన్ ఐకాన్ పురస్కారం అందుకున్నారు. ఒరిస్సాలోని భువనేశ్వర్‌కు చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ ఫేమస్ పీపుల్ ఇండియా వరల్డ్ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో కృషి చేస్తున్న ప్రముఖులకు పురస్కారాలను అందించింది. అందులో భాగంగా సాహితీ రంగంలో పట్టణానికి చెందిన తనకు పురస్కారం లభించిదని, ఆన్లైన్ వేదికగా దాన్ని అందుకున్నట్లు ఆళ్ల తెలిపారు. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ రాజేష్ పాండ, కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావును అభినందించినట్లు చెప్పారు.



అన్నదానం చేస్తున్న గిరిధరరావు తదితరులు

బాటసారుల కోసం సత్రం ఏర్పాటు

ప్రజాశక్తి - తెనాలి

బాటసారుల కోసం సత్రాన్ని ఏర్పాటు చేసి, భోజన వసతి సౌకర్యాలను కల్పించిన మహనీయులు కాకుమాను వెంకటసుబ్బయ్య అని పలువురు వక్తలు కొనియాడారు. వెంకటసుబ్బయ్య జయంతి సందర్భంగా గురువారం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో సత్రం ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కె.గిరిధరరావు ఆధ్వర్యంలో అన్నదానం, దుప్పట్ల పంపిణీ చేశారు. గిరిధరరావు మాట్లాడుతూ దాదాపు 100ఏళ్ల కిందటే వెంకటసుబ్బయ్య బాటసారులకు వసతి కల్పించేందుకు ఆరు గదుల పెంకుటిల్లు దానంగా ఇచ్చి, నిర్వహణకు కొంత ఆస్తిని కూడా కేటాయించినట్లు చెప్పారు. 2012 వరకు వెంకట సుబ్బయ్య వంశీయులు పూర్ణచంద్రరావు సత్రాన్ని నిర్వ హించారన్నారు. వెంకటసుబ్బయ్య జయంతి సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సత్రం ఈవో ఎన్ వి ఎన్ మల్లీశ్వరి, సిబ్బంది సుబ్బారావు, సీతామాలక్ష్మి, కృష్ణ పాల్గొన్నారు.



వార్డులో పర్యటిస్తున్న చైర్పర్సన్ రాధిక

పారిశుద్ధ్య పనులను పరిశీలించిన చైర్‌పర్సన్

ప్రజాశక్తి - తెనాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక గురువారం పట్టణంలోని 21, 26, 27, 28 వార్డులలో పర్యటించారు. పినపాడులో పంట కాలువ పూడికతీతను పరిశీలించిన ఆమె అధికారులకు, పారిశుద్ధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. మురుగునీటిపారుదల వ్యవస్థను మెరుగుపరిచేందుకు పట్టణంలోని అన్ని వార్డులలో నిరంతర ప్రక్రియగా శానిటేషన్ జరుగుతుం దన్నారు. ఆమె వెంట మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె హెలెన్ నిర్మల, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కె సాంబశివరావు, సచివాలయం శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

కాలయాపన కాదు ... సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - దుగ్గిరాల



రైతుల సమస్యలపై మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

బాండ్ల పరిశీలన పేరుతో కాలయాపన చేయడం సరైంది కాదని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ బాధితుల సంఘం కన్వీనర్ వేములపల్లి వెంకటరామయ్య అన్నారు. దాదాపు ఆరు నెలల కిందట హైదరాబాద్‌కు చెందిన ప్రైవేట్ సంస్థ జుబెరాన్ అండ్ కంపెనీ నష్టపోయిన రైతుల వద్ద బాండ్ జిరాక్స్ కాపీలను తీసుకున్నది. మొత్తం 294 మంది కాపీలను అందజేశారు. అయితే పేర్లు తప్పు పడ్డాయనీ, కొన్ని బాండ్ మిస్ అయ్యాయి అని వివిధ కారణాల చేత రైతులకు సంబంధించి 58, చిన్నాచితక వ్యాపారస్తులకు సంబంధించి 79 బాండ్లు సేకరించేందుకు జుబేర్ అండ్ కంపెనీ ప్రతినిధులు తిరిగి గురువారం దుగ్గిరాల యార్డుకు వచ్చారు. ఈ సందర్భంగా రైతులు, రైతు సంఘాలు అనేక అభ్యంతరాలు వ్యక్తం చేసారు. అగ్ని ప్రమాదానికి సంబం ధించి నష్టపరి హారం చెల్లించే విషయంలో అధికారులకు సరైన సమాచారం లేదని విమర్శించారు. వేములపల్లి వెంకట రామయ్య మాట్లాడుతూ బస్తాకు 75 కిలోలచొప్పున క్వింటాలుకు రూ.7వేల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కార్య క్రమంలో జొన్న శివశంకర్ జెట్టి బాలరాజు ఎం యోగేశ్వర రావు వై బ్రహ్మేశ్వర రావు వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు పడుచూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ నిరసన

ప్రజాశక్తి - తెనాలి



నిరసన వ్యక్తం చేస్తున్న పెన్షనర్లు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ చట్టం 1972 సవరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తపాలా శాఖ పెన్షనర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం. ఉమామహేశ్వరరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం పిలుపు మేరకు గురువారం స్థానిక హెడ్ పోస్ట్ఆఫీస్ వద్ద పోస్టల్ శాఖ పెన్షనర్స్ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ మార్చి 25న లోక్ సభలో, 27న రాజ్యసభలో కేంద్ర ఆర్థిక బిల్లు ఆమోదం సందర్భంగా కేంద్ర పెన్షన్ చట్టం 1972 కు సవరణ బిల్లును పెట్టారని, ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. తెనాలి డివిజన్ కార్యదర్శి ఎల్ ప్రసాదరావు మాట్లాడుతూ పెన్షనర్లకు ఎనిమిదవ వేతన సవరణలో ఏమాత్రం లబ్ది చేయకూరదన్నారు. దీనిపై పోస్టల్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. నిరసనలో డివిజన్ పోస్టల్ ఉద్యోగ సంఘ నాయకులు వివి సత్యనారాయణ, టి పోతురాజు, ఎస్.కె నూరుద్దీన్, తపాలా పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు ఐ.కోటేశ్వరరావు, కె లక్ష్మణ రావు, ఎం.తిరుమల రావు, గోవింద నాథ్, దీక్షితులు, ఎల్ ప్రసాదరావు పాల్గొన్నారు.

నిర్మల ఫార్మసీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు కళా శాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాముల రెడ్డి తెలిపారు. గురు వారం జరిగిన ఇంటర్వ్యూలలో మొత్తం 125 మంది విద్యా ర్థులు పాల్గొన్నట్లు తెలిపారు. బీఫార్మసీ, ఫార్మా డి విద్యా ర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కరస్పాండెంట్ సెక్రటరీ జి.నిర్మల జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులకు అభినం దనలు తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్ సెల్ ఆఫీసర్ ఎం ప్రశాంతి, సమన్వయకర్త వి జోజీ బాబు, సిహెచ్ భార్గవ్, గోపి, ఒమేగా హెల్త్ కేర్ ప్రతినిధులు ఎం. ధరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రాజమండ్రిలో కాటూరి శిల్పశాల ప్రదర్శన

ప్రజాశక్తి-తెనాలిరూరల్



తెనాలి ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసేలా కాటూరి ఆర్ట్ గ్యాలరి కృషి చేయడం ముదావహమని కుమార్ పంప్స్ ఇండస్ట్రీస్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం అన్నారు. చిత్ర, శిల్ప కళావీధి పేరుతో గురువారం రాజమండ్రిలో ఏర్పాటు చేయనున్న ప్రతిమలను సుబ్రహ్మణ్యం, విశ్రాంత ఎస్పి సత్యన్నారాయణ మూర్తి తిలకించారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సృజన, సాంకేతికత జోడించిన ప్రతిమల్లో వైవిధ్యం కనిపిస్తోందని అన్నారు. విశ్రాంత ఎస్పి మాట్లాడుతూ రాజమహేంద్ర వరంలో తెనాలి ప్రతిష్టను మరోసారి ప్రదర్శించడానికి అవకాశం దక్కడం హర్షణీయమన్నారు. రాష్ట్ర సజనాత్మకత, సంస్కృతి సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి పిలుపు మేరకు కాటూరి ఆర్ట్ గ్యాలరి ఆధ్వర్యంలో శిల్పకళా ప్రదర్శన నిర్వ హించ నున్నట్లు ప్రముఖ శిల్ప కారులు కాటూరి వెంకటే శ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్ష తెలిపారు. రాజ మండ్రిలో ప్రద ర్శించ నున్న విగ్రహాలను గురు వారం కంచర్లపాలెం తెనాలి కాటూరి ఆర్ట్‌గ్యాలరీ లో ప్రత్యేక ప్రదర్శనగా ఏర్పాటు చేశామన్నారు.

కెఎల్‌యులో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్



అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి రక్తం అవసరమని అందుకు స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా చూడాలని కెఎల్ యూనివర్శిటీ విద్యార్థి సంక్షేమ విభాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్ విద్యార్థులకు సూచించారు. గురువారం కెఎల్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ మరియు వైఆర్ సీ, జేసీఐ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 18-60 ఏళ్ల మధ్య వయస్సు ఉండి, 50కిలోల బరువు ఉన్న ఆరోగ్యవంతులు ఎవరైనా 3 నెలలకొకసారి రక్తదానం చేయవచ్చన్నారు. డీన్ స్టూడెంట్ అఫైర్స్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లాఖాన్ శిబిరానికి వచ్చిన రక్తదాతలకు అవగాహన కల్పించారు. శిబిరానికి సమన్వయకర్తగా వ్యవహరించిన పి.సురేష్, రక్తదాతలను వర్శిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధివర్మ, ప్రోవీసీలు డాక్టర్ ఏవీఎస్.ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, విద్యార్థి సంక్షేమ విభాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్. ప్రసాద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి, యూత్ రెడ్ క్రాస్ ఇంచార్జి డాక్టర్ ఆర్. సుప్రియ, జేసీఐ జోన్ డైరెక్టర్ రవీంద్రారెడ్డి అభినందించి సర్టిఫికెట్లు అందచేశారు.



దీక్షల్లో కూర్చున్న సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

121 రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం ఏ సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం నాటికి 121 రోజులకు చేరుకున్నాయి. దీక్షల్లో వై యెహోషువ, ఎన్ సుబ్బారావు, బి దానయ్య, ఎండి రహీమ్ తుల్లా, వై నాగేశ్వరరావు కూర్చున్నారు. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కే ఆదినారాయణ ప్రారంభించారు. వారు మాట్లాడుతూమంత్రి నారా లోకేష్ తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సందర్భంగా ఆయన ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఆశీర్వా దం, బి ఎస్ ఎస్ సింగ్, గురవయ్య, శాస్త్రి, వై సాంబయ్య, టీ నాగేశ్వరరావు, ఎం శివకుమారి, టి దుర్గా భవాని, ఈ సారమ్మ, ఎస్కే ఇమాంబి, ఏ విజయశ్రీ, సిహెచ్ రమణ పాల్గొన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈఓ జయంతి బాబు

నెహ్రూ నికేతన్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రోబోటిక్ ఎక్స్‌పో

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక బోస్ రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గురువారం రోబో వింగ్ టెక్నాలజీ సంస్థ ఆధ్వర్యంలో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, రోబోటిక్ ఎక్స్పో నిర్వహించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళి కాంత్ దాసరి పర్యవేక్షణలో నిర్వహించిన ప్రదర్శనలో అతిథులకు హ్యూమనైట్ రోబోట్ గులాబీలు అందించటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎడ్జి డిటెక్టింగ్ రోబోట్, వయస్సును కనుగొనే ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ప్రోగ్రామింగ్, చాట్ జిపిటి ప్రోగ్రామింగ్, హెూమ్ ఆటోమేషన్, డ్రోన్ పనిచేసే తీరు అంశాలను విద్యార్థులు ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాధికారి-2 వి.జయంతి బాబు మాట్లాడుతూ బట్టీ విధానానికి స్వస్తి పలికి, విద్యార్థుల మేధాశక్తికి పదులుపెట్టే ప్రదర్శనలు అభినందనీయమన్నారు.కార్యక్రమంలో మురళికాంత్ దాసరి, రోబోటిక్ టెక్నాలజీస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు వి వెంకట సాయిరాం, సాజీద్ షేక్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న మండల కమిటీ

స్మార్ట్ మీటర్లు, కరెంటు ఛార్జీలు వద్దంటూ వాల్ స్టిక్కర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఫిరంగిపురం

సిపిఎం పార్టీ ఫిరంగిపురం మండల కమిటీ ఆధ్వర్యంలో పొనుగుపాడు గ్రామంలో మా ఇంటికి స్మార్ట్ మీటర్ల వద్దు, కరెంట్ చార్జీలు తగ్గించాలని కోరుతూ వాల్‌స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలీ మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల్లో భాగంగా ఆదానికి లాభాలు చేకూర్చడం కోసం రాష్ట్ర ప్రజల మీద స్మార్ట్ మీటర్ భారాన్ని రుద్దుతున్నారని అన్నారు. ఈ స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు ముందుగానే రీచార్జి చేయించుకోవలసి ఉంటుందని ఆయన అన్నారు. ప్రజలపై ట్రూ ఆప్, సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్లను కూటమి ప్రభుత్వం ప్రజలపై భారమేసిందని అన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు జి వెంకటేశ్వరరావు, కే కోటేశ్వరరావు, వై నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

నేడు పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ

డాన్‌బాస్కో స్కూలు వద్ద ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్‌పి

ప్రజాశక్తి మంగళగిరి


ఇళ్ల పట్టాలిచ్చే ప్రాంగణాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ

దాదాపుగా దశాబ్దాల కాలం నాటి పేద ప్రజల కళ నెరవేర్చనున్న మంత్రి స్థానిక శాసనసభ్యులు నారా లోకేష్ తలపెట్టిన కార్యక్రమానికి డాన్ బాస్కో స్కూల్ పక్కన ఉన్న ప్రాంగణం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ గురువారం పరిశీలించారు. శుక్రవారం ఉదయం పేదలకు పట్టాబి . షేకం కార్యక్రమం లో పేద ప్రజలకు పట్టాలు స్వయంగా అందజేయనున్న మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా రోజుకి దాదాపుగా 2000 మంది కార్యక్రమానికి హాజరవుతున్నారని దానిలో భాగంగా పార్కింగ్, ట్రాఫిక్ కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రత ఏర్పాటులను పటిష్టంగా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రత ఏర్పాటులను చేస్తున్నట్ల పోలీస్ అధికారులు తెలిపారు. దానిలో భాగంగానే నేడు ఎస్పీ పర్యటన జరిగిందని స్థానిక పోలీస్ అధికారులు తెలియజేశారు. వాహనాలను దారి మళ్లింపు లేకుండా ట్రాఫిక్‌ను నియంత్రించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. పరిశీలించిన వారిలో మంగళగిరి గ్రామీణ సీఐ వై శ్రీనివాసరావు, గ్రామీణ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్, టిడిపి క్రిష్ణాయపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు ఆవల రవి కిరణ్ ఉన్నారు.

మహిళా చట్టాలపై ఆర్‌విఆర్‌లో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు



అడ్వకేట్ కళ్యాణిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్

మహిళలు ధైర్యాన్ని ప్రధాన ఆయుధంగా మార్చుకుంటే ప్రతి సమస్యను సులువుగా పరిష్కరించుకోవచ్చని, లింగ వివక్ష వినపడితే అభివృద్ధికి నిజమైన అర్థం చేకూరుతుందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అడ్వకేట్ పి.కళ్యాణి అన్నారు. గురువారం ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో 'సెక్సువల్ హెరాస్మెంట్ ఆఫ్ ఉమెన్ ఎట్ వర్క్‌ప్లేస్ (ప్రివెన్షన్, ప్రొహిబిషన్ అండ్ రిడ్రసెల్) యాక్ట్ 2013'పై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు అత్యున్నత పదవుల్లో తమ సామర్థ్యాన్ని నిరూపిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములవుతున్నారని, లింగ సమానత్వం నెలకొన్నప్పుడే సమసమాజం నిర్మాణం సాధ్యం అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చదువుతోపాటు న్యాయ వ్యవస్థ, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు డాక్టర్ జె.మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని అన్నారు. మహిళా శక్తి సమాజ అభివృద్ధికి పునాది వంటిదని సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ అన్నారు. సదస్సులో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

ప్రజాశక్తి-గుంటూరు

ఏఐ, నెట్‌వర్క్ బయోలజీ ప్రెసిషన్ థెరపీలు వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకు రావడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎన్ఐటీ వరంగల్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ ఆసిం బికాస్‌దాస్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'రీసెంట్ కంప్యూటింగ్ ట్రెండ్స్ ఫర్ బయోఇన్ఫర్మేటిక్స్ అండ్ బయోటెక్నాలజీ' అనే అంశంపై మూడ్రోజుల సదస్సు, వర్క్‌షాప్‌ను గురువారం ప్రారంభించారు. తొలుత కాన్ఫరెన్స్‌కు సంబంధించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. ప్రొఫెసర్ ఆసిం బికాస్‌దాస్ మాట్లాడుతూ క్యాన్సర్ ప్రపంచ వ్యాప్తంగా పెద్ద సవాలుగా మిగిలిపోయిన ఒక ముఖ్యమైన ఆరోగ్య సమస్య అని, ఈ రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), నెట్‌వర్క్ బయోలజీ వంటి ఆధునిక సాంకేతికతలు క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. నెట్‌వర్క్ బయోలజీ అనేది జీవశాస్త్ర సంబంధిత అంశాలను (జెనెటిక్స్, ప్రోటీవోమిక్స్, మెటాబోలిక్స్) అనుసంధానించి, క్యాన్సర్ వంటి రుగ్మతలను విశ్లేషించడానికి సహాయపడే ఒక శాస్త్రంగా ఎదుగుతోందన్నారు. ఈ టెక్నాలజీలు త్వరలో మరింత అభివృద్ధి చెందుతుండటం వలన, క్యాన్సర్ చికిత్సలో మరింత విజయాలను సాధించడం నిజంగా సాధ్యమవుతుందన్నారు. పుదుచ్చేరి లోని ఐసీఎంఆర్ వెక్టర్ కంట్రోల్ రీసెర్చ్ సెంటర్ సైంటిస్ట్ డాక్టర్ నంద కుమార్ యెల్లపు మాట్లాడుతూ కంప్యూటేషనల్ వైద్య విజ్ఞానం సమ్మిళితంగా, వ్యక్తిగత వైద్య శాస్త్రాన్ని మరింత అభివద్ధి చేస్తూ, ప్రతి రోగికి అనుకూలమైన చికిత్సను అందించే దిశగా నడుస్తోందన్నారు. ఈ రంగంలో మరిన్ని పరిశోధనలు, అధునాతన సాంకేతికతల అభివృద్ధి మెరుగైన ఆరోగ్య సంరక్షణకు దారి చూపు తాయని వెల్లడించారు. గుజరాత్‌లోని బేస్‌సాల్వ్ ఇన్ఫర్మేటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఆదిత్య నారాయణ్ సరంగి మాట్లాడుతూ కంప్యూటేషనల్ వర్క్‌ఫ్లో మరింత స్వయంచాలకంగా మారుతూ, వేగవంతమైన, ఖచ్చితమైన వ్యాధి నిర్ధారణను అందించే విధంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ ఆధునిక జీవసాంకేతిక పద్ధతులు భవిష్యత్తులో ఆరోగ్య సంరక్షణ రంగంలో విప్లవాత్మక మార్పులకు దారి తీసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

అసరాలకు అనుగుణంగా ఇసుక సరఫరా : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాలో రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు సంబంధించి అవసరమైన అనుమతులు, ఇతర ప్రక్రియలు నిర్దేశిత సమయంలో పూర్తిచేసి ప్రజల అవసరాలకనుగుణంగా ఇసుక సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజతో కలసి పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక తవ్వకాలకు బోట్స్‌మెన్ సొసైటీకి కేటాయించే రాయిపూడి డీ-సిల్టిషన్ పాయింట్ పర్యవేక్షణ ఏ శాఖ పరిధిలోకి వస్తుందో రాష్ట్ర మైనింగ్ శాఖ అధికారులను సంప్రదించి తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. బొమ్మువారి పాలెం-16 ఓపెన్ శాండ్ రీచ్ మైనింగ్ ప్లాన్‌ను రూపొందించి టెండర్ షెడ్యూల్‌ను సిద్ధం చేయాలన్నారు. గుండిమెడ ఓపెన్ శాండ్ రీచ్ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం బిడ్‌లు ఆహ్వానించి ఏప్రిల్ 16 నాటికి అర్హతగల బిడ్డర్‌కు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద నదిలో ఇసుక నిల్వల కోసం హైడ్రో గ్రాఫిక్ సర్వే కోసం ఈఈ, కేసి కెనాల్ డివిజన్‌కు జిల్లా వాటా కింద రూ.24 లక్షలు మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక సరఫరా చేసే కేంద్రాల వద్ద పర్యవేక్షణ కోసం సంబంధిత తహసీల్దార్ల ద్వారా రెవెన్యూ ఉద్యోగులను మైనింగ్ అధికారులు నియమించుకోవాలన్నారు. సమావేశంలో డిఆర్ఓ ఖాజావలి, జిల్లా మైన్స్ జియాలజీ అధికారి (ఇంచార్జ్) నాగిని, గుంటూరు ఆర్‌టిఓ జి.ఎస్.ప్రసాద్, జిల్లా భూగర్భ జలవనరుల శాఖ డీడీ వందనం, జిల్లా పంచాయతీ అధికారి సాయి కుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అసమగ్ర డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం

ప్రజాశక్తి-గుంటూరు




మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

పార్లమెంట్ నియోజకవర్గాల అసమగ్రమైన పునర్విభజన ప్రక్రియ వల్ల సమాఖ్య వ్యవస్థకు మరింత హానికరం అని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. 2026లో జనగణన జరిపి, పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. డీ లిమిటేషన్ - సవాళ్లు' అనే అంశంపై బ్రాడీపేట లోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో గురువారం స్టడీ సర్కిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మధ్యతరగతి ఫోరమ్ కన్వీనర్ వి.వి. కే. సురేష్ అధ్యక్షత వహించారు.ముఖ్య వక్తగా హాజర్కెన లక్ష్మణరావు మాట్లాడుతూ గతంలో ఇందిరాగాంధీ, వాజ్‌పేయిలు ప్రధాన మంత్రులుగా ఉన్న సమయంలో రాజ్యాంగ సవరణల ద్వారా డీలిమిటేషన్ ప్రక్రియను 25 ఏళ్లపాటు రెండు సార్లు వాయిదా వేశారని అన్నారు. జాతీయ జనాభా నియంత్రణ పాలసీని 1976లో ప్రకటించిన తర్వాత దక్షిణాది రాష్ట్రాలు దాన్ని చిత్తశుద్ధితో అమలు చేశాయని అన్నారు. జనాభా నియంత్రణ విషయంలో ముందు చూపుతో వ్యవహరించాయని అన్నారు. అందుకు దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంట్ స్థానాల విషయంలో నష్టం వాటిల్లకూడదని అన్నారు. మన రాష్ట్రంలోని అధికార కూటమి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు కూడా జరపాలని అన్నారు.జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ లోక్‌సభ సీట్ల పెంపుదలను ఏకపక్షంగా జరిపితే రాజ్యాంగ మౌలిక సూత్రమైన సమాఖ్య స్ఫూర్తికి విఘాతం ఏర్పడుతుందని అన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలు ప్రమాదంలో పడటం ఆందోళనకరమన్నారు. 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' పేరుతో ఇప్పటికే బిజెపి ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని అన్నారు. సీట్ల పెంపుదల వల్ల ఏ ఒక్క రాష్ట్రం నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థలు, సంఘాల తరపున విశ్రాంత ఇంజనీర్ జి.వెంకట్రావు, ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాల రావు, అవధానుల హరి, సి.హెచ్.కుమార్, బి.ముత్యాలరావు, ఎన్.సదాశివరావు, అబ్దుల్ సలీం, కె.నళినీకాంత్, ఎమ్.ఎ. చిస్టీ, బి. శ్రీనివాసరావు, ఎమ్.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు 9న రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి-గుంటూరు : స్మార్ట్ టెక్స్, జిఎంసి ఆధ్వర్యంలో త్వరలో గుంటూరు నిర్వహించబోయే మెగా జాబ్‌మేళాకు సంబంధించి 9న స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మాక్ ఇంటర్వ్యూ, రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్మార్ట్ టెక్స్ చైర్‌పర్సన్ దివ్యతో కలిసి జాబ్‌మేళా పోస్టర్‌ని కమిషనర్ గురువారం ఆవిష్కరించారు. జిఎంసి పరిధిలోని 10వ తరగతి నుండి పిజి, ఐటిఐ, డిప్లొమా చదివిన, ఇంజనీరింగ్, ఫార్మసి, నర్సింగ్ పూర్తి చేసిన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. షుమారు 50 కంపెనీల నుండి ఉద్యోగాలు అందించేలా త్వరలో గుంటూరు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామన్నారు.



మంగళగిరి ఎయిమ్స్‌ను సందర్శించిన ఢిల్లీ వైద్య బృందం

ప్రజాశక్తి - మంగళగిరి

నరసరావుపేటలో బాలిక మృతి కేసుకు సంబంధించి గురువారం మధ్యాహ్నం మంగళ గిరి ఎయిమ్స్ హాస్పిటల్లో, వైద్య బృందంతో ప్రత్యేక సమావేశమైంది. ఢిల్లీ, బాంబే నుంచి వచ్చిన వైద్య నిపుణుల బృందం సమావేశం జరిపారు. మృతి చెందిన బాలికకు చెందిన రక్త నమూనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుంటూరు మెడికల్ కళాశాలకు బయలుదేరి వెళ్లారు. మొత్తం ఐదుగురు డాక్టర్ల బృందం, వీరిలో వెటర్నరీకి సంబంధించిన డాక్టర్ కూడా ఉన్నారు. డాక్టర్ అంకుర్ జార్జ్ న్యూ ఢిల్లీ డాక్టర్ శైలిష్ పవార్ బొంబాయి డాక్టర్ నిధీసైని జాయింట్ డైరెక్టర్ మంగళగిరి ఎయిమ్స్ డాక్టర్ పాల్గొన్నారు.